వైభవంగా రాములోరి కల్యాణోత్సవాలు

వాడవాడలా శ్రీరామ నవమి వేడుకలు

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల్లోని ఆలయాలు, గ్రామాల్లో శ్రీరామ నవమి వేడుకలను గురువారం భక్తులు అత్యంత వైభవంగా నిర్వహించారు. రామాలయాల వద్ద భక్తులు బారులు తీరారు. ముక్త్యాల రోడ్డులోని శ్రీధ్రశైల సీతారామస్వామి ఆలయం(పెద్ద రామాలయం)లో శాశ్వత కల్యాణ ధర్మకర్తలు తుమ్మేపల్లి నరేంద్రరావు, వారి సోదరుల ఆధ్వర్యంలో అర్చకులు ముదుంబా వరదాచార్యులు స్వామివారికి కల్యాణం జరిపించారు. ఆలయ కమిటీ చైర్మన్ తుమ్మేపల్లి వెంకటేశ్వరరావు, ఈఓ కె.నాగరాజు పాల్గొన్నారు. అప్సరా సెంటర్‌లోని శ్రీకోదండరామ స్వామి ఆలయంలో బ్రహ్మశ్రీ పిల్లలమర్రి నాగకృష్ణ శర్మ ఆధ్వర్యంలో అర్చకులు అలగిరి యోగానందాచార్యులు కల్యాణం జరిపించారు. కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు రాచర్ల సతీష్, తుమ్మేపల్లి నరేంద్ర, ఉపాధ్యక్షులు, కోశాధికారి కొత్తా పురుషోత్తం, స్వామి కృష్ణ పాల్గొన్నారు. పాలేటి తీరాన ఉన్న వరదాంజనేయ స్వామి ఆలయంలో కల్యాణోత్సవం, భారీ అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. అద్దాలబజారులో ఉన్న శ్రీమహాలక్ష్మి అమ్మవారి వెండి దేవాలయంలో, కొలిమిబజారులో శ్రీసీతారామ మందిరం ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో కల్యాణోత్సవాలను నిర్వహించారు. వెండి దేవాలయంలో కమిటీ చైర్మన్ అత్తులూరి వెంకటేశ్వర్లు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కల్యాణోత్సవంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్..

పట్టణంలోని పాలేటి తీరాన ఉన్న వరదాంజనేయ స్వామి ఆలయంతో పాటు పలు ఆలయాల్లో జరిగిన కల్యాణోత్సవాల్లో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్ తదితరులు పాల్గొని పూజలు నిర్వహించారు. కౌన్సిలర్లు వట్టెం మనోహర్, తన్నీరు నాగేంద్ర, కాశి కిషోర్, నాయకులు చావా పిచ్చయ్య, చిరంజీవి, నీలం శివప్రసాద్, కావేటి కృష్ణ పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలులో కల్యాణోత్సవం..

పెనుగంచిప్రోలు: శ్రీసీతారామచంద్ర స్వాముల వారి కల్యాణాన్ని మండలంలోని పలు ఆలయాల్లో గురువారం వైభవంగా నిర్వహించారు. స్థానిక శ్రీతిరుపతమ్మ అమ్మవారి ఆలయంలో స్వామివారు, అమ్మవార్ల కల్యాణాన్ని ఆలయ వేద పండితుల మంత్రోచ్ఛరణ నడుమ అర్చకులు ఘనంగా జరిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు, పాలకవర్గ సభ్యులు కోలా రామారావు, ఆదిమూలం నరసింహారావు, కర్ల వెంకటేశ్వర్లు, ఏఈఓ కొండలరావు, తిరుమలేశ్వరరావు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పెనుగంచిప్రోలులోని పోలీస్‌స్టేషన్ సెంటర్, చెరువుకట్ట బజారులోని రావిచెట్టు సెంటర్‌లో, కోదండ రామాలయం, కృష్ణమందిరం, ఎస్సీ కాలనీల్లో, పలు వీధుల్లో, మండలంలోని పలు గ్రామాల్లో సీతారాముల కల్యాణోత్సవాలు నిర్వహించి భక్తులకు పానకం, ప్రసాదాలు పంపిణీ చేశారు.

వాడవాడలా రాములోరి కల్యాణం

వత్సవాయి: శ్రీరామనవమిని పురస్కరించుకుని మండలంలో వాడవాడలా రాములోరి కల్యాణోత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి రామాలయాలకు భక్తులు పోటెత్తారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వత్సవాయి, దబ్బాకుపల్లి, పోలంపల్లి, కంభంపాడు,చిట్టేల, మక్కపేట, భీమవరం, గోపినేనిపాలెం, మంగొల్లు తదితర గ్రామాలలోని రామాలయాల వద్ద స్వామివారి కల్యాణాన్ని వేద పండితులు మంత్రోచ్ఛరణల నడుమ అంగరంగ వైభవంగా సాగింది. భక్తులు స్వామివారి కల్యాణాన్ని తిలకించి తీర్థప్రసాదాలు తీసుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా దేవదాయశాఖ ఈఓ సీహెచ్ హరిదుర్గానాగేశ్వరరావు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

నందిగామ నియోజకవర్గ వ్యాప్తంగా..

నందిగామ: వాడవాడలా గురువారం శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీరామ నవమిని పురస్కరించుకొని పలు ఆలయాల్లో సీతారాముల కల్యాణం కనుల పండువగా జరిగింది. ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన చలువ పందిళ్లలో శ్రీరాముడు, సీతాదేవి ప్రతిమలను ఉంచి కల్యాణం జరిపించారు. రామాలయాలు, ఆంజనేయ స్వామి దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పానకం, వడ పప్పుతో పాటు పలు చోట్ల అన్న ప్రసాద వితరణతో పాటు పులిహోర పొట్లాలు పంపిణీ చేశారు. నందిగామ పట్టణంలోని కూరగాయల మార్కెట్ బజారులో వేం చేసి ఉన్న శ్రీ సీతారామాంజనేయ స్వామి వారి ఆలయంలో సీతారాముల కల్యాణం నేత్రపర్వంగా జరిగింది. వేద పండితుల ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణానికి ముత్యాల తలంబ్రాలు అందజేయడంతో పాటు సంఘం అధ్యక్షుడు మహంకాళి వెంకన్న గురుస్వామి ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. స్వామివారి కల్యాణ కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహనరావు హాజరయ్యారు. ఎమ్మెల్యేను నిర్వాహకులు శాలువాతో సత్కరించారు. అదేవిధంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. పలుచోట్ల భక్తులు స్వచ్ఛందంగా పానకం పంపిణీ చేశారు. పట్టణ శివారు అనాసాగరం రామాలయంలో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. మండలంలోని ప్రతి గ్రామంలో స్వామి వారి కల్యాణోత్సవాలను కనుల పండుగగా జరిగింది.

చందర్లపాడులో..

చందర్లపాడు మండలంలోని గ్రామగ్రామాన సీతారాముల కల్యాణోత్సవాలు వేడుకగా జరిగాయి. పలు గ్రామాల్లో ప్రజాప్రతినిధులు పీటలపై కూర్చొని స్వామి వారి కల్యాణాన్ని నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వీరులపాడులో వేడుకలు..

వీరులపాడు: మండలంలోని అన్ని గ్రామాల్లో శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయాలు, ప్రధాన కూడళ్ల వద్ద చలువ పందిళ్లు వేసి సీతారాముల కళ్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. మండలంలోని నరసింహారావుపాలెం గ్రామంలో వేం చేసి ఉన్న కోదండ రామచంద్ర స్వామి వారి ఆలయంలో వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ సీతారాముల కల్యాణోత్సవాన్ని జరిపారు. గ్రామానికి చెందిన తొమ్మిది మంది దంపతులు పీటలపై కూర్చుని కల్యాణాన్ని జరిపించారు. కార్యక్రమంలో సర్పంచ్ బొమ్మిశెట్టి దుర్గాదేవి, ఏఎంసీ మాజీ చైర్మన్ బొమ్మిశెట్టి భాస్కరరావు, ఆలయ ధర్మకర్త విజయభాస్కర్ రెడ్డి, పెద్ద సంఖ్యలో భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పెద్దాపురంలో..

పెద్దాపురం గ్రామంలోని ప్రసన్నాంజనేయ స్వామి వారి ఆలయంలో శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ కోటేరు లక్ష్మి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్ బాబులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి వారి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా జరిపించారు. కార్యక్రమంలో సర్పంచ్ నిప్పులపల్లి శాంతమ్మ, ఉప సర్పంచ్ బవిరిశెట్టి లక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ ఆవుల ప్రసాద్, మాజీ చైర్మన్ కోటేరు సత్యనారాయణరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

వీ అన్నవరంలో..

మండలంలోని అన్ని గ్రామాల్లో సీతారాముల కల్యాణోత్సవాలను వైభవంగా జరిపించారు. వీ అన్నవరం గ్రామంలోని ఆంజనేయ స్వామి వారి ఆలయంలో సీతారాముల కళ్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ జమ్ముల వరబాబు, నాయకులు జమ్ముల శేషగిరి, బేతు రాంబాబు పాల్గొన్నారు.


శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో కల్యాణం నిర్వహించిన ఆలయ అధికారులు


నందిగామ పట్టణంలోని రామాలయంలో కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు


నందిగామ ఆలయంలో స్వామి వారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు


పేటలోని పెద్ద రామాలయంలో..


పేటలో కల్యాణోత్సవంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర తదితరులు


కొణకంచిలో కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు


మక్కపేటలో కల్యాణంలో పాల్గొన్న దంపతులు


నరసింహారావుపాలెంలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు


నందిగామ మెయిన్ బజార్‌లో..

కల్యాణం.. కమనీయం

జగ్గయ్యపేట: మండలంలోని పలు గ్రామాల్లోని రామాలయాల్లో సీతారాముల కల్యాణోత్సవాలను నిర్వాహకులు అత్యంత వైభవంగా నిర్వహించారు. రావిరాలలోని ప్రసన్నాంజనేయ స్వామి వారి ఆలయంలో సీతారాముల కల్యాణాన్ని గ్రామస్తుల ఆధ్వర్యంలో కనుల పండువగా చేపట్టారు. అర్చకులు మార్తి శివరామకృష్ణ ఆధ్వర్యంలో సీతారామచంద్రుల విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువచ్చి కల్యాణం జరిపించారు. గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త చిరుమామిళ్ల బాలకృష్ణ ప్రసాద్ స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహించారు. ధర్మవరప్పాడుతండ, జయంతిపురం, కె.అగ్రహారం, బండిపాలెం గ్రామాల్లో సీతారాముల కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు.

సీతారాముల కల్యాణం చూతము రారండీ..

కంచికచర్ల: శ్రీరామ నవమి సందర్భంగా పలు ఆలయాల్లో శ్రీ సీతా రాముల కల్యాణోత్సవాన్ని అత్యంత వైభవంగా జరిగింది. కంచికచర్ల భావనా థియేటర్ సమీపంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు వేమా సురేష్‌బాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలువ పందిరిలో ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు ఎమ్మెల్యేను సత్కరించారు. స్వామి వారి కల్యాణోత్సవం జరిగింది. అనంతరం మూడు వేల మంది భక్తులకు అన్న సమారాధన చేశారు. నెహ్రూ బొమ్మ సెంటర్, పెట్రోలు బంక్ సెంటర్, వసంతకాలనీలో నాగలక్ష్మి అమ్మవారి ఆలయంలో స్వామివారి కల్యాణం జరిగింది. ఎస్‌ఐ సుబ్రహ్మణ్యం స్వామివారి కల్యాణం తిలకించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నెహ్రూ బొమ్మ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సీతారాముల ఉత్సవ విగ్రహాలను గ్రామ వీధుల్లో ఊరేగించారు.


జయంతిపురంలో కల్యాణంలో పాల్గొన్న గ్రామస్తులు


స్వామి వారి కల్యాణోత్సవంలో పాల్గొన్న దంపతులు


జుజ్జూరురోడ్డులో అన్న సమారాధన చేస్తున్న ఎస్‌ఐ సుబ్రహ్మణ్యం


కంచికచర్ల పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు


ధర్మవరప్పాడుతండాలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కంచికచర్ల: విద్యుత్ వైర్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ కృష్ణారావు గురువారం తెలిపారు. ఉదయం 7.30 నుంచి 11.30 గంటల వరకు కంచికచర్లలోని గొట్టుముక్కల రోడ్డు, జుజ్జూరు రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. వినియోగదారులు విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని ఏఈ కోరారు.

ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయం

జయంతి(వీరులపాడు): మానవాళి రక్షణకు ప్రభువు ఏసుక్రీస్తు లోకానికి వచ్చారని ములుగుమాటి జోసఫ్ సుగుణరావు పేర్కొన్నారు. మండలంలోని జయంతి గ్రామంలోని నిత్య సహాయ మాత ఆలయంలో గురువారం ఈస్టర్ పండుగ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసుక్రీస్తు బోధనలు ప్రతి ఒక్కరికీ అనుసరణీయమైనవన్నారు. అనంతరం భక్తి గీతాలు ఆలపిస్తూ గ్రామంలో సిలువ మార్గంను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ మారపాక మహాలక్ష్మి, మాజీ సర్పంచ్ మారపాక శ్రీను, ఇనపనూరి రవి, నాయకులు పాల్గొన్నారు.

చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

నందిగామ: కేంద్రంలోని బీజేపీ వ్యవహరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5న తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి కటారపు గోపాల్ తెలిపారు. చలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను గురువారం పట్టణ శివారు అనాసాగరం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేయడంతో పాటు ప్రజలను చైతన్యం చేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చలో ఢిల్లీ కార్యక్రమం ఉద్దేశం కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కార్మికులు, రైతులకు వ్యతిరేకంగా చేస్తున్న కార్యక్రమాలు, కేంద్రం కార్పొరేట్ సేవల్లో మునిగితేలుతున్న అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

ఆత్మీయ సత్కారం



గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): గుంటుపల్లి రైల్వే వ్యాగన్ వర్క్‌షాపులో పదవీ విరమణ చేసిన ప్రొడక్షన్ ఇంజినీర్ పత్తిపాటి సంపత్‌కుమార్‌కు ఉద్యోగులు గురువారం ఆత్మీయ సత్కారం చేశారు. సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ కార్యదర్శి గద్దా సురేష్ మాట్లాడుతూ వర్క్‌షాపులో చార్జ్‌మెన్‌గా ఉద్యోగం ప్రారంభించి వివిధ హోదాల్లో పదోన్నతి పొందిన సంపత్‌కుమార్ తోటి ఉద్యోగులకు ఆదర్శప్రాయమన్నారు. సంపత్‌కుమార్ దంపతులను ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. బ్రాంచి అధ్యక్షుడు శివనాగేశ్వరరావు, వర్కింగ్ చైర్మన్ దాసరి డేవిడ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ఇంటింటి సర్వే



కనిమెర్ల తండా(మైలవరం): మండలంలోని కనిమెర్ల తండాలో లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ద్వారా ఇంటింటి సర్వే నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు గురువారం తెలిపారు. కళాశాల ఆధ్వర్యంలో దత్తత గ్రామం కనిమెర్ల తండా, వెదురుబీడెంలలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరంలో 15 నుంచి 29 సంవత్సరాల వయస్సున్న యువతీ యువకులు చేస్తున్న పనులపై సర్వే నిర్వహించారు. సర్వేలో 30శాతం మంది యువతీయువకులు చదువు మానేసి కూలి పనులకు వెళుతున్నట్లు సర్వేలో తేలిందని ప్రిన్సిపాల్ తెలిపారు. దీనిపై వలంటీర్లు విద్య ప్రాముఖ్యం, ఉద్యోగావకాశాలపై యువతకు తెలియజేసి చైతన్య పరిచామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అసిస్టెంట్ ఆఫీసర్ ఉమామహేశ్వరరెడ్డి, వలంటీర్లు పాల్గొన్నారు.

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భార్యను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్న భర్తపై భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు... విద్యాధరపురం చెరువు సెంటర్‌కు చెందిన బంకా లక్ష్మీ టైలరింగ్ పనిచేస్తుంది. భర్త వీరయ్య లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వీరయ్య నిత్యం మద్యం తాగి భార్యను అనుమానించి వేధిస్తున్నాడు. తరచూ కొడుతూ ఉండడంతో గతంలో పలు పర్యాయాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. గొడవలు లేకుండా కాపురం చేసుకుంటామని అంగీకరించి, తిరిగి ఎప్పటిలాగే వేధింపులు ప్రారంభించాడు. గురువారం మద్యం తాగి వచ్చి భార్యను కొట్టాడు. అడ్డువచ్చిన అత్త దేవర లక్ష్మమ్మ, పిల్లలను కొట్టాడు. దీనిపై బంకా లక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వ్యాయామం జీవితంలో భాగం కావాలి


ఓపెన్ జిమ్‌ను ప్రారంభించి వ్యాయామం చేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

ఓపెన్ జిమ్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామటౌన్: మానవ దైనందిన జీవితంలో వ్యాయామం భాగం కావాలని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. పట్టణ శివారు అనాసాగరంలో ఏర్పాటు చేసిన డాక్టర్ వైఎస్సార్, వీఎం రంగా ఓపెన్ జిమ్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో మానవ జీవితం యాంత్రికంగా మారిందన్నారు. వ్యాయామం చేయటం వల్ల శారీరక దారుఢ్యంతో పాటు మంచి ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చని చెప్పారు. ప్రజల ఆరోగ్యం దృష్ట్యా విద్యార్థులు, యువకులతో పాటు ప్రతి ఒక్కరూ వినియోగించుకునేలా రూ.6.50 లక్షల వ్యయంతో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశామన్నారు. పట్టణ వాసులు జిమ్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన..

పట్టణంలోని 20 వార్డుల పరిధిలోని అంతర్గత రహదారులను ప్రాధాన్యాతా క్రమంలో సిమెంట్ రోడ్లుగా అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే జగన్‌మోహనరావు పేర్కొన్నారు. పట్టణ పరిధిలోని అనాసాగరంలో సాధారణ నిధులు రూ.5 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పట్టణాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి సైతం నియోజకవర్గ అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తున్నారని చెప్పారు. అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్‌లు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, ప్రజా ప్రతినిధులు కూడా పనులను పర్యవేక్షించాలని ఆయన సూచించారు.

వైఎస్సార్ అర్బన్ హెల్త్ క్లినిక్ పరిశీలన..

అనాసాగరంలోని వైఎస్సార్ అర్బన్ హెల్త్ క్లినిక్‌ను ఎమ్మెల్యే జగన్‌మోహనరావు పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి, కౌన్సిల్ సభ్యుడు పాకాలపాటి కిరణ్, వార్డు ఇన్‌చార్జి కరి రవీంద్ర, ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, మున్సిపల్ కమిషనర్ జయరాం, ఏఈ ఫణి శ్రీనివాస్, వైస్ చైర్‌పర్సన్లు మాడుగుల నాగరత్నం, ఓర్సు లక్ష్మి, నాయకులు గుడివాడ సాంబశివరావు, పాములపాటి రమేష్, చిరుమామిళ్ల చైతన్యకుమార్, మారం అమరయ్య, మందా మరియమ్మ, జాఫర్, యాకుబ్ వలీ, చాపల మల్లికార్జునరావు, మెల్లెంపూడి లక్ష్మి, నల్లమల్లి మురళి, విశ్వనాథపల్లి కృపారావు, మున్నా పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి మృతి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఘటనపై మృతుడి అక్క ఫిర్యాదు మేరకు పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. చిట్టినగర్ పెండెం రాములు వీధికి చెందిన గాయపోటి దుర్గా వెంకట ప్రసాద్ (40)కు వివాహం కాగా ఇద్దరు సంతానం. వెంకట ప్రసాద్ భార్యతో విభేదాల కారణంగా ఆమె ఇద్దరి పిల్లలతో తన పుట్టింట్లో ఉంటుంది. దీంతో భర్త ఒంటరిగా ఉంటున్నాడు. భార్య పిల్లలు తనతో లేరని అనేక సార్లు మదన పడేవాడు. ఈ క్రమంలో ఈ నెల 25వ తేదీన వెంకట ప్రసాద్ పురుగుల మందు తాగాడు. అదే భవనంలో కింద పోర్షన్‌లో ఉండే మేనల్లుడు భవానీ ప్రసాద్ ఈ విషయం గురించి తల్లి దుర్గాదేవికి చెప్పడంతో వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న వెంకట ప్రసాద్ బుధవారం రాత్రి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేయడంతో పాటు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

సీతారామ కల్యాణంలో సీపీ దంపతులు

భవానీపురం(విజయవాడపశ్చిమ):శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా విజయవాడ బందర్ రోడ్‌లోని పోలీస్ క్వార్టర్స్‌లోగల సాయుధ రిజర్వ్ పోలీస్ రామాలయంలో ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టీకే రాణా దంపతులు సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలుకగా పోలీస్ కమిషనర్ దంపతులు సంప్రదాయ పద్ధతిలో స్వామివార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం సీతారాముల ఉత్సవ విగ్రహ మూర్తులకు వైభవంగా కల్యాణం చేశారు. డీసీపీలు విశాల్ గున్నీ, ఏబీటీఎస్ ఉదయ రాణి, మోకా సత్తిబాబు (అడ్మిన్), కె శ్రీనివాసరావు (ట్రాఫిక్), బీ రామకృష్ణ (సీఎస్‌డబ్ల్యు), సిటీ స్పెషల్ బ్రాంచ్ ఏడీసీపీ సీహెచ్ లక్ష్మీపతి, క్రైమ్ ఏడీసీపీ పీ వెంకటరత్నం, ఏఆర్ ఏడీసీపీ కె శ్రీనివాసరావు, ఏసీపీలు జీవీ రమణమూర్తి, వీఎస్ వాసన్, చెంచిరెడ్డి, పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది, పోలీస్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.


కల్యాణం జరిపిస్తున్న సీపీ టీకే రాణా దంపతులు

అలరించిన కూచిపూడి నృత్యాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్):శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా శ్రీకళ్యాణ రామాలయంలో చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు అలరించాయి. భక్తి కీర్తనలకు అనుగుణంగా చిన్నారులు చేసిన నృత్యాలు ప్రేక్షకులను రంజింపచేశాయి. భక్తితన్మయత్వంలో ముంచెత్తాయి. అనంతరం చిన్నారుల భరత నాట్య ప్రదర్శన జరిగింది.


నృత్యం ప్రదర్శిస్తున్న చిన్నారులు

నేటితో వడ్డీ రాయితీ గడువు ముగింపు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాల్టీలో ఇంటి పన్నుల చెల్లింపునకు ప్రభుత్వం ఇచ్చిన వడ్డీ రాయితీ గడువు శుక్రవారంతో ముగుస్తుందని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఇంకా ఆస్తిపన్ను చెల్లించని వారు శుక్రవారం ఉదయం 8 నుంచి రాత్రి 10గంటల వరకు వడ్డీ రాయితీతో కట్టొచ్చని పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయం, పాత గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్లు, మీ ఇంటికి వచ్చే సచివాలయ సిబ్బందికి వడ్డీ రాయితీతో ఇంటిపన్ను చెల్లించాలని సూచించారు.

వేసవి దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఎండలు మండుతున్న నేపథ్యంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని కొత్తపేట పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ సుబ్రహ్మణ్యం అన్నారు. చిట్టినగర్ కలరా హాస్పటల్, సాయిరాం సెంటర్‌లో మీనాక్షి కనస్ట్రక్షన్స్ అధినేత పెద్ది రమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను సీఐ సుబ్రహ్మణ్యం గురువారం ప్రారంభించారు. సింహాచలం దేవస్థానం పాలకమండలి సభ్యుడు కూరాకుల నాగ, బీజేపీ నాయకులు బీఎస్ పట్నాయక్, చిట్టినగర్ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు నల్లబెల్లి శ్రీనివాస్, యేసు, బెవర సూరిబాబు, కత్తెర రమేష్ పాల్గొని పాదచారులకు మజ్జిగ పంపిణీ చేశారు.